పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కంది శ్రీరాములు

సుభాష్‌నగర్‌: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల కృషి ఎనలేనిదని సుభాష్‌ నగర్‌ డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు అన్నారు. మంగళవారం ఆయన బతుకమ్మ పండుగ సందర్భంగా 15 మంది మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సూరారం కాలనీలోని తన నివాసంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంది శ్రీరాములు మాట్లాడుతూ ఏటా తన వంతుగా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు అందజేస్తున్నట్లు తెలిపారు.

జన్మదిన వేడుకలు



కొలన్‌ శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న అభిమానులు..

నిజాంపేట్‌: నిజాంపేట్‌ కార్పొరేషన్‌ సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు కొలన్‌ శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలన్‌ హన్మంత్‌రెడ్డి, మున్సిపల్‌ అధ్యక్షుడు కొలన్‌ రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీనివాస్‌రెడ్డితో కేక్‌ కట్‌ చేయించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కమిటీలతో కాలయాపన తగదు

కుత్బుల్లాపూర్‌: ఎస్సీ వర్గీకరణ అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని మేడ్చల్‌ జిల్లా ఎంఎస్పీ ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై నాడు ప్రగల్భాలు పలికి నేడు కమిటీల పేరుతో రెండు నెలలుగా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు వర్గీకరణపై స్పష్టమైన వైఖరిని ప్రకటించినా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేపట్టకుండా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు బుధవారం తూంకుంటలోని అంబేడ్కర్‌ విగ్రహం నుండి మేడ్చల్‌ కలెక్టరేట్‌ వరకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్‌, ఎంఎస్పీ, అనుబంధ సంఘాలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

డీజే నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాసరావు

మూసాపేట: డీజే నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఆయా ప్రాంతాల వారీగా నిర్దేశించిన డెసిబుల్స్‌లో మాత్రమే ప్లే చేయాలని ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. కూకట్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌లో డీజే నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఏసీపీ పరిధిలోని 4 పోలీస్‌ స్టేషన్ల పరిధిలో సుమారు 30 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీజే ప్లే చేసేందుకు సమీపంలోని పోలీస్‌ స్టేషన్‌లో ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. సమావేశంలో కూకట్‌పల్లి సీఐ ముత్తు, డీఐ వెంకటేశ్వర్లు, అల్లాపూర్‌ సీఐ వెంకట్‌రెడ్డి, కేపీహెచ్‌బీ సీఐ వెంకన్న, బాచుపల్లి డీఐ తిమ్మప్ప, డీజే నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి పంచలోహ విగ్రహం విరాళం



పంచలోహ అమ్మవారి విగ్రహం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్‌ 2లోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆలయ ధర్మకర్తలు వాడ్యాల భాస్కర్‌రెడ్డి, శ్యామల దంపతుల కుమార్తె సుష్మ రంజిత్‌ రెడ్డి దంపతులు మంగళవారం రూ.2 లక్షల వ్యయంతో 100 కేజీల పంచలోహ విగ్రహాన్ని ఆలయ ధర్మకర్తకు అందజేశారు. ఆమెను ఆలయ నిర్వాహకులు అభినందించారు.

అధికారులే అండ.. దండ..!

అక్రమార్కులకు అండగా నిలుస్తున్న వైనం

- అమలుకునోచని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆదేశాలు
- యథేచ్ఛగా కొనసాగుతున్న సెల్లార్ల తవ్వకం

కుత్బుల్లాపూర్‌: అక్రమ సెల్లార్లకు అధికారులు అండగా నిలుస్తున్నారు. ఓ వైపు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలి సెల్లార్‌ తవ్వకాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎక్కడికక్కడే కట్టడి చేయాలని ఆదేశాలు జారీ చేసినా కిందిస్థాయి సిబ్బంది మాత్రం డబ్బులకు అమ్ముడు పోతున్నారు.. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ పరిధిలోని ఎస్‌పీజీ గ్రాండ్‌ హోటల్‌కు వెళ్లే హైటెన్షన్‌ రోడ్డులో ఓ వ్యక్తి సెల్లార్‌ నిర్మాణం చేపడుతున్నట్లు గత నెల మొదటి వారంలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ కమిషనర్‌ నరసింహ, అప్పటి టౌన్‌ ప్లానింగ్‌ అధికారి ప్రభావతి అక్కడికి వెళ్లి సెల్లార్‌ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అక్రమంగా సెల్లార్‌ తవ్వినందుకు రూ. 2 లక్షలు జరిమానా విధించారు. అంతేగాక సెల్లార్‌ను పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ విషయంపై 'సాక్షి'లో సెప్టెంబర్‌ 4న కథనం కూడా ప్రచురితమైంది. అయితే ఇంతలో ఏమైందో ఏమోగాని సదరు నిర్మాణదారుడు మళ్లీ సెల్లార్‌ పనులు చేపట్టడం విశేషం.


అక్రమ సెల్లార్లకు
అడ్డుకట్టేదీ..?

'సాక్షి'లో వచ్చిన కథనం..

అధికారుల తీరుపై అనుమానాలు..

కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో సెల్లార్‌ నిర్మాణాలు కూడా కొనసాగుతున్నాయి. వీటిని కట్టడి చేయాల్సిన అధికారులు మామూళ్లకు అలవాటు పడి పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైటెన్షన్‌ రోడ్డుతో పాటు రంగారెడ్డినగర్‌, కుత్బుల్లాపూర్‌, చింతల్‌, సుభాష్‌ నగర్‌ డివిజన్లలో ఎక్కడపడితే అక్కడ సెల్లార్ల తవ్వకాలు చేపడుతున్నారు. సెల్లార్‌ తవ్వకాలను నిషేధిస్తూ గ్రేటర్‌ కమిషనర్‌ ఉత్తర్వులు జారీ చేసినా సర్కిల్‌- 25 అధికారులు మాత్రం తమ పరిధి కాదన్నట్లుగా వ్యవహరిస్తుండటం విశేషం. నామ మాత్రంగా నోటీసులు జారీ చేసి నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేయడమే టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు పనిగా పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సమగ్ర విచారణ చేపడితే నిజానిజాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.



హైటెన్షన్‌ రోడ్డులో కొనసాగుతున్న సెల్లార్‌ నిర్మాణ పనులు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..



హై టెన్షన్‌ రోడ్డులో జరుగుతున్న సెల్లార్‌ పనులను నిలిపివేశాం. ప్రస్తుతం జరుగుతున్న పనుల విషయం మాకు తెలియదు. టౌన్‌ ప్లానింగ్‌ అధికారులను పంపి పరిశీలిస్తాం. సెల్లార్‌ నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.. ఇప్పటికే బాధ్యులకు నోటీసులు జారీ చేశాం.. సెల్లార్‌ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించం.

నరసింహ,
కుత్బుల్లాపూర్‌ డిప్యూటీ కమిషనర్‌..

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్‌: విద్యుత్‌ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో బుధవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్‌ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ బాలాజీ ఆస్పత్రి ఫీడర్‌ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు బాలాజీ ఆస్పత్రి మెయిన్‌రోడ్డు, కాంటన్‌ పార్కు, సెరినా ఎవెన్యూ గేట్‌ నెంబరు 1, 2, 3, అంగడిపేట్‌ హైటెన్షన్‌ రోడ్లలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామన్నారు.

జగద్గిరిగుట్ట సెక్షన్‌ పరిధిలో..

- 11కేవీ ఓల్డ్‌ చింతల్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు చింతల్‌, చంద్రానగర్‌, 11కేవీ భగత్‌సింగ్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు భగత్‌సింగ్‌నగర్‌, చంద్రానగర్‌, దుర్గానగర్‌, స్ఫూర్తినగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాధాకిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

14న ప్రపంచ పెద్దల దినోత్సవం

ఆల్విన్‌కాలనీ: సీనియర్‌ సిటిజన్స్‌ సంఘాల సమాఖ్య, కూకట్‌పల్లి చాప్టర్‌ ఆధ్వర్యంలో ప్రపంచ పెద్దల దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. వివేకానందనగర్‌ కాలనీలోని వడ్డేపల్లి కమలమ్మ సీనియర్‌ సిటిజన్స్‌ భవనంలో 14న కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్య అతిథిగా ఐఏఎస్‌ అధికారి వాడ్రేపే చిన వీరభద్రుడు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందించిన ఐదుగురు సీనియర్‌ సిటిజన్లను సన్మానించనున్నట్లు తెలిపారు.



ఘనంగా దీపోత్సవం



నిజాంపేట్‌: నిజాంపేట జర్నలిస్టు కాలనీలోని శ్రీ దుర్గామాత అమ్మవారి మండపం వద్ద దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విద్యుద్దీపాల వెలుగుల మధ్య అమ్మవారు రోజుకో అలంకారంలో దర్శనమిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కాలనీ మహిళలు అమ్మవారి ఎదుట దీపోత్సవం నిర్వహించారు. శివలింగం, ఓంకారం, స్వస్తిక్‌ ఆకృతుల్లో దీపాలను వెలిగించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు.

నేటి నుంచి చెరువుల్లోకి చేప పిల్లలు

- 232 చెరువుల్లో...34 లక్షల చేప పిల్లలు వదిలేందుకు చర్యలు
- శామీర్‌పేట పెద్ద చెరువులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: ఆలస్యంగానైనా .. చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పంపిణీ చేసేందుకు మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా మత్స్యశాఖ ముహూర్తం ఖరారు చేసింది. సాధారణంగా వర్షాకాలం ఆరంభమై.. చెరువులు, కుంటలు నిండగానే ఆగష్టు లేదా సెప్టెంబర్‌ నాటికి చేప పిల్లలను పంపిణీ చేస్తారు. చేప పిల్లల టెండర్ల ప్రక్రియ జాప్యం కావటంతో ఆలస్యంగా పంపిణీ కార్యక్రమానికి మత్స్యశాఖ శ్రీకారం చుట్టింది. శామీర్‌పేట మండల కేంద్రంలోని పెద్ద చెరువులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా బుధవారం చేప పిల్లలను వదలనున్నారు. ఎంపీ ఈటల రాజేందర్‌, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, శంభీపూర్‌ రాజు, మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కలెక్టర్‌ గౌతమ్‌, మత్స్యశాఖ అధికారి పూర్ణిమా, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారు. 2024-25 సంవత్సరంలో మత్స్యశాఖ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 232 చెరువుల్లో 34 లక్షల చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించింది.

80-100 మి.మీ చేప పిల్లల పంపిణీ..

చెరువుల్లో పంపిణీ చేయనున్న 34 లక్షల చేప పిల్లల్లో 35-40 మి.మీ సైజు ఉన్న చేప పిల్లలు, 80-100 మి.మీ సైజు ఉన్న చేప పిల్లలు ఉన్నట్లు మత్స్య శాఖ పేర్కొంటోంది.ఇందులో నాలుగు రకాలు(తెగలు) చేప పిల్లలు ఉన్నాయి.

-83 సంఘాల్లో 3,773 మంది సభ్యులు

మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో 83 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 64 ప్రాథమిక పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. అలాగే 13 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, మూడు ఫిషర్మెన్‌ మార్కెటింగ్‌ కో-ఆపరేటివ్‌ సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 3,773 మంది సభ్యులు ఉన్నారు. చేపల పెంపకం ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా బలపడతారన్న సంకల్పంతో ప్రభుత్వం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువులు, కుంటల్లో చేప పిల్లలను పెంచుతోంది.

గతేడాదిలో 91 లక్షల చేప పిల్లల పంపిణీ

గతంలో జిల్లాలో 62 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 352 చెరువుల్లో ఉచితంగా 91 లక్షల చేప పిల్లలను మత్స్య శాఖ పంపిణీ చేసింది. ఈ చేప పిల్లలలో పెద్ద సైజు (80-100 ఎం.ఎం.) 13.50 లక్షలు కాగా, చిన్న సైజు చేప పిల్లలు (40-45 ఎంఎం) 77.50 లక్షలు ఉన్నట్లు మత్స్యశాఖ పేర్కొంది.

చేప పిల్లల పంపిణీ ప్రారంభం



మత్స్యకారులకు ఆర్థిక చేయూతను అందించేందుకు చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలను వదిలివేస్తున్నాం. చేప పిల్లలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి కావటంతో బుధవారం నుంచి చెరువుల్లో పంపిణీ చేస్తున్నాం. కలెక్టర్‌ ఆదేశాలతో గుర్తించిన 232 చెరువుల్లో 34 లక్షల చేప పిల్లలు పంపిణీ చేస్తున్నాం.

– పూర్ణిమా, మత్స్యశాఖ అధికారి



సుచిత్ర మూడుగుళ్ల సమీపంలో..



నిజాంపేట్‌లోని శ్రీనల్లపోచమ్మ ఆలయంలో..

ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కుత్బుల్లాపూర్‌: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవారు ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణాల్లో నిర్వహించిన చండీహోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



దూలపల్లిలో..



భగత్‌సింగ్‌నగర్‌లో..



ధనలక్ష్మి అవతారంలో అమ్మవారు..



రంగారెడ్డినగర్‌లో..



మహదేవపురం సాయిహిల్స్‌లో..

మందుబాబులకు అడ్డాగా పార్కులు



ఏపీహెచ్‌బీ కాలనీ పార్కు-2లో మద్యం బాటిళ్లు..

రంగారెడ్డినగర్‌: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు కాలనీల్లో పార్కులను ఏర్పాటు చేసిన అధికారులు వాటి నిర్వహణను స్థానిక సంక్షేమ సంఘాలకు అప్పగించారు. రంగారెడ్డినగర్‌ డివిజన్‌ ఏపీహెచ్‌బీ కాలనీలోని పార్కు-2లో మద్యం బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. చీకటి పడగానే కొందరు ఆకతాయిలు తాళాలు వేసి ఉన్న పార్కుల్లోకి ప్రవేశించి మద్యం సేవిస్తూ బాటిళ్లను అక్కడే వదిలి వెళ్తున్నారు. అధికారులు జోక్యం చేసుకుని మందుబాబుల అగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటోస్టాండ్‌ ఏర్పాటు చేయాలి

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ.. మంగళవారం కాప్రా సర్కిల్‌ ఆటో యూనియన్‌ నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉచిత బస్సులతో ఇప్పటికే ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ చాలీచాలని జీవితాలు గడుపుతున్నామని ఎంపీకి తెలిపారు. సర్కిల్‌ పరిధిలోని ఆటోలు నిలిపేందుకు అనువుగా ఆటోస్టాండ్‌ ఏర్పాటు చేయించి చతికిలపడ్డ ఆటో డ్రైవర్లకు చేయూతనివ్వాలని కోరారు. ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌టీయూ ఆటో యూనియన్‌ నాయకులతో పాటు కాప్రా సర్కిల్‌ ఆటో యూనియన్‌ అధ్యక్షుడు రామాంజనేయులు, గోపాల్‌నాయక్‌, రమేష్‌, నరేష్‌, జయరాజ్‌, శ్రీనివాస్‌, నర్సింగ్‌ నాయక్‌, లక్ష్మీనారాయణ, శ్రీను, అనీల్‌, బాలకృష్ణ, సుమన్‌, సాయికిరణ్‌, రవి, స్వామి, దాసు, వెంకటేష్‌, ప్రభాకర్‌, వినయ్‌ తదితరులు పాల్గొన్నారు.